# అంతర్వాహిని

గాలి పటానికి గల దారం తెగిపోతే అది ఎగురుకుంటూపోయి ఎక్కడ పడుతుందో తెలియదు.

ఉదజనితో నిండిన బెలూన్ ఆకసంపైకి వదిలితే ఉదజని ఉన్నంతసేపూ గగన విహారం చేస్తూ ఉదజని అయిపోయాక ఎక్కడో కూలిపోతుంది.

తమ మైత్రికి గాలిపటంలాగ, బెలూన్ లాగ సగంలోనే విఘాతం కలగకుండా ఉండాలంటే శాశ్వతమైన బంధుత్వం ఏర్పరచుకోవాలి. ఇదీ ఇందిర తండ్రీ చతురాననం తండ్రీ ఒకరికి తెలియకుండా ఒకరు తీసుకున్న నిర్ణయం.

ఒక శుభదినాన ఇందిర తండ్రి చతురాననం తండ్రిని కలిసి "చాలా రోజుల్నించీ నీతో ఒక ముఖ్య విషయం ముచ్చటించా లనుకుంటున్నానురా. ఇప్పుడు సమయం చిక్కింది. మీ అబ్బాయిని మా అల్లుడుగా చేసుకోవాలని ఉందిరా!" అన్నాడు.

"నాకూ అలాగే ఉందిరా. మీ అమ్మాయిని మా కోడలిగా స్వీకరించాలని ఉంది!" అన్నాడు చతురాననం తండ్రి.

ఉభయులూ ఆనంద భరితులయ్యారు.

సినిమా కథల్లో ఓ ముసలాడు చనిపోతూ తన మిత్రుని చేతిలో చేయి వేయించుకుని "మా అమ్మాయిని నీ కోడలిగా చేసుకోవాలిరా!" అని ప్రమాణం చేయించుకుంటాడు.

సినిమా కథ వేరు, నిజ జీవితం వేరు, పెద్దల ఇద్దరి మధ్యా ఒప్పందం

కుదిరింది. కాబోయే జీవిత భాగస్వాముల మధ్య అవగాహన కుదరాలి కదా?

చతురాననాన్ని వివాహం చేసుకుందుకు ఇందిర అంగీకారం తెలిపింది.

చతురాననం మాత్రం ఇందిరని ఇల్లాలిగా చేసుకోడానికి సమ్మతించలేదు. కారణం ఇందిరలోని అంగవైకల్యం!

ఈ విషయాన్ని చతురాననం తండ్రి ఇందిర తండ్రికి భారావహమైన గుండెతో, గద్గదికమైన గొంతుతో అతి బాధాకరంగా చెప్పాడు.

"సరే - దానికి నువ్వేం చేస్తావులే. ఎక్కడ ఘటనుంటే అక్కడే అవుతుంది" అని సముదాయిస్తాడు ఇందిర తండ్రి.

❁ ❁ ❁

ఇక వధువుల వేట ప్రారంభించాడు చతురాననం. తనకు వధువు నచ్చితే, వధువు తనని నచ్చలేదు. వధువుకు తాను నచ్చితే, తనకు వధువు నచ్చలేదు. ఇలా ఇరవై ముప్ఫయ్ సంబంధాలు చూశాడు. వధువుల ఎంపికలో రెండు వార్షికోత్సవాలు జరుపుకున్నాడు.

ఈలోగా తండ్రి కాలం చేశాడు.

ఇక గత్యంతరం లేక భూమి గుండ్రంగా ఉన్నట్లు మరోసారి రుజువు చేశాడు. ఇందిరనే వివాహం చేసుకుంటాననీ, ఆమెకు అంగవైకల్యం ఉండడం వల్లనే ఆమె పట్ల ప్రగాఢ సానుభూతితో తనకు జీవిత భాగస్వామినిగా స్వీకరించ దలచాననీ ఒక మిత్రుని ద్వారా ఉత్తరం పంపాడు.

ఇందిర నుంచి ప్రత్యుత్తరం వచ్చింది.

'చతురాననంగార్కి అభినందనలతో-'

"రుక్మిణీదేవి ఆనాడు అగ్నిద్యోతనుడు అనే మధ్యవర్తిని కృష్ణుని దగ్గరకు రాయబారం పంపినట్టు, ఈ నాడు మీరు మరో మధ్యవర్తి ద్వారా నా దగ్గరకు ఒక లేఖతో పాటు రాయబారం పంపారు. కృతజ్ఞత. వికలాంగుల్ని వికలాంగులే వివాహం చేసుకుంటే ఒకరి కొకరు సహకరించుకునే అవకాశం ఉండదనీ, అంచేత వికలాంగుల్ని వికలాంగులు కాని వారు వివాహం చేసుకోడం కనీస ధర్మం అని మీ ఆదర్శాన్ని చాటి చెప్పినందుకు ధన్యవాదం! అయితే ప్రయాగలోని త్రివేణీ సంగమంలో ఈనాడు సరస్వతీ నది అంతర్లీనమై అంతర్వాహినిగానే ఉన్నట్టు, మీ 'ఆదర్శంలో' అంతర్లీనమైన కోరిక ఉన్నట్లు నాకు అనిపిస్తోంది."

"నాకు అంగవైకల్యం కొత్తగా రాలేదు. జన్మతః ఉన్నదే! ఇంతక్రితం నన్ను మీ అర్థాంగిగా స్వీకరించమని మా నాన్నగారు కోరినప్పుడు - అంగవైకల్యం ఉన్న వాళ్ళని చేసుకుంటే మీ స్నేహితుల మధ్య చిన్నతనంగా ఉంటుందనీ, ఒకవేళ ఏ సినిమా కెళ్లినా కుంటుకుంటూ హాల్లో అడుగుపెడితే నలుగురిలోనూ అవమాన భారంతో క్రుంగిపోవలసి వస్తుందనీ మీరు భావించారు. ఆనాటి నేను వికలాంగురాలిని ఈనాడు కోమలాంగిని అయిపోయానా? అది మీ మనోవైకల్యం మాత్రమే! ఈనాడు మళ్ళీ నన్ను మీ అర్థాంగిగా చేసుకోడానికి మీరు సిద్ధపడ్డారంటే నా మీద మీకు జాలి అని భావించను. వికలాంగుల కోటాలో ఉద్యోగం సంపాదించిన ఉద్యోగస్తురాల్ని! మీ రెండు వేలతోనూ మీరు తాగుడూ, జూదమూ, వ్యభిచారంతోను జల్సాలు చేస్తే - నా రెండు వేలతోనూ కుటుంబ పోషణ చేసుకుంటూ, మీకు వండి పడుండి, సుఖాలిస్తూ పిల్లల్ని కనే యంత్రంలా నేనుండాలన్నది - మీలో అంతర్లీనంగా ఉన్న ధ్యేయం!

కాబట్టి మీ ఆఫర్‌ని తిరస్కరిస్తున్నాను!

ఇట్లు - ఇందిర"

• ఆంధ్రప్రభ వీక్లీ •
*13–2–1991*